సాక్షి
బాపట్ల
గురువారం । 8 । ఆగస్టు । 2024



వెండి కిరీటాలు బహూకరణ

కొల్లూరు: కొల్లూరుకు చెందిన సూరపనేని ప్రసాదరావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు వెండి కిరీటాలను అనంతభోగేశ్వర ఆలయంలోని దేవతామూర్తులకు వితరణ చేశారు.



49,224 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 47,647 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి 49,224 బస్తాలు అమ్మకాలు జరిగాయి.



వైభవంగా పుష్పయాగం

నగరంపాలెం: గుంటూరు బృందావన్‌గార్డెన్స్‌లోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం గోదా అమ్మవారి తిరునక్షత్రం సందర్భంగా పుష్పయాగం వైభవంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

గోదాదేవి తిరునక్షత్ర మహోత్సవం



తాడేపల్లిరూరల్: సీతానగరంలోని విజయకీలాద్రి దివ్య క్షేత్రంపై బుధవారం గోదాదేవి తిరునక్షత్ర మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ పరమహంస పరివ్రాజకులు శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి మంగళ శాసనాలతో ఉదయం 9 గంటలకు గోదాదేవి అమ్మవారికి తిరుమంజనం (అభిషేకం), తదితర కార్యక్రమాలను వైభవంగా నిర్వహించామని, మహిళా భక్తులు అధికసంఖ్యలో పాల్గొని గోదాదేవిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారని తెలిపారు. కార్యక్రమంలో విజయకీలాద్రి దేవస్థాన అర్చకులు, జీయర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ వేదపండితులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.


రేపు హెచ్‌సీఎల్ టెక్‌బీ ప్రోగ్రాం ఎంపికలు

గుంటూరుఎడ్యుకేషన్:గుంటూరు జిల్లా ఉపాధి కార్యాలయం, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 9న హెచ్‌సీఎల్ టెక్‌బీ ప్రోగ్రాం ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె.రఘు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఐటీ రంగంలో కెరీర్‌ను ప్రారంభించేందుకు ఆసక్తి కలిగి 2023, 2024 సంవత్సరాల్లో ఇంటర్ నాన్ మాథ్స్ (సీఈసీ, హెచ్‌ఈసీ, బైపీసీ, ఒకేషనల్) కోర్సులను 75 శాతం మార్కులతో పూర్తి చేసిన యువతీ, యువకులు అర్హులని తెలిపారు. సంబంధిత అభ్యర్థులు బయోడేటా, రెజ్యూమ్, విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్, ఆధార్ జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో జిల్లా కలెక్టరేట్ ఎదుట ఉన్న ప్రభుత్వ ఐటీఐలో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్న హెచ్‌సీఎల్ ఎర్లీ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ఇంటర్వ్యూలకు నేరుగా హాజరు కావాలని సూచించారు. రాత పరీక్ష, హెచ్‌ఆర్ ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారని, ఇతర వివరాలకు 80746 07278 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

13న భవిష్యనిధి పెన్షన్ అదాలత్

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు కృష్ణనగర్‌లోని భవిష్యనిధి ప్రాంతీయ కార్యాలయంలో ఈనెల 13న పెన్షన్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ ఇంద్రనీల్ ఘోష్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలోని పీఎఫ్ పెన్షనర్లు వారి ఫిర్యాదులు, దరఖాస్తులను నేరుగా భవిష్యనిధి కార్యాలయంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్న పెన్షన్ అదాలత్‌లో సమర్పించవచ్చని తెలిపారు. వ్యక్తిగతంగా హాజరు కాలేని వారు ఆన్‌లైన్, వాట్సాప్, వెబ్ మార్గాల ద్వారా పంపవచ్చని సూచించారు. ro.guntur@epfindia.gov.inతో పాటు వాట్సాప్ నంబరు 94946 57469కు పంపాలని తెలిపారు. ల్యాండ్‌లైన్ నంబర్లు 0863-2344106, 2232921 నంబర్లో సంప్రదించాలని పేర్కొన్నారు. అదే విధంగా వెబ్ ఎక్స్ ఐడీ 2644 636 3676, పాస్‌కోడ్ epfo@1234 ద్వారా లాగిన్ కావాలని తెలిపారు. పీఎఫ్ పెన్షన్ దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భవిష్యనిధి పింఛనుదారులు లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలని పీఎఫ్ కమిషనర్ తెలిపారు. పింఛను పొందుతున్న వారు బ్యాంకు, సీఎస్‌సీ, పీఎఫ్ కార్యాలయం ద్వారా పోస్ట్ ఇన్ఫో యాప్ ద్వారా లైఫ్‌సర్టిఫికెట్లు సమర్పించాలని, లేకుంటే పోస్ట్‌మెన్ నేరుగా ఇంటికే వచ్చి వేలిముద్ర, ఐరిష్, స్కాన్ ద్వారా లైఫ్ సర్టిఫికెట్ స్వీకరిస్తారని తెలిపారు. ఆండ్రాయిడ్ ఫోన్ ద్వారా ఆధార్ ఫేస్ యాప్, జీవన ప్రమాణ ఫేస్ అప్లికేషన్ ఉపయోగించి ఆధార్ నంబరుతోనూ లైఫ్ సర్టిఫికెట్ సమర్పించవచ్చునని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు పీఎఫ్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 6,034 క్యూసెక్కులు విడుదల చేశారు. హైలెవల్ కాలువకు 296, బ్యాంక్ కెనాల్‌కు 1578, తూర్పు కెనాల్‌కు 640, పశ్చిమ కెనాల్‌కు 270, నిజాంపట్నం కాలువకు 380, కొమ్మమూరు కాలువకు 2880 క్యూసెక్కులు విడుదల చేశారు.

రక్తం మరిగే!

- హత్యల పరంపర
- చీరాలలో భీతావహం

రక్తం మరిగిన గంజాయి బ్యాచ్ జూలు విదిలిస్తోంది. కత్తులు, తల్వార్లతో చెలరేగుతోంది. కాలేజీకి వెళ్లిన యువకుడిని హతమార్చింది. బహిర్భూమికి వెళ్లిన ఆడబిడ్డను కామదాహంతో బలి తీసుకుంది. ఓ చిన్న వివాదం చిరు వ్యాపారిని పట్టపగలే మట్టుబెట్టింది. ఓ కేబుల్ టీవీ నిర్వాహకుడి దురాశ నిద్ర పోతున్న తల్లిని మంచంలోనే విగతజీవిని చేసింది. ఈ ఘటనలు చూస్తున్న చీరాల ప్రజల రక్తం సలసలా మరుగుతున్నా.. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వానికి ఏమాత్రం పట్టడం లేదు. శాంతిభద్రతలకు రక్తతర్పణాలొదులుతోంది. అసమర్థతతో లా అండ్ ఆర్డర్‌ను అస్తవ్యస్తం చేస్తోంది.

నెత్తుటి చారిక

- ఆరీఫ్‌ను హత్య చేసింది గంజాయి బ్యాచే
- చీరాలలో 45 రోజుల్లోనే మూడు హత్యలు, ఒక గ్యాంగ్ రేప్, హత్య
- బాపట్ల జిల్లాలో శాంతిభద్రతలకు తిలోదకాలు
- కూటమి ప్రభుత్వం అసమర్థతే కారణం
- అస్తవ్యస్తంగా లా అండ్ ఆర్డర్



హత్యకు గురైన లలితమ్మ, సుచరిత (ఫైల్)

సయ్యద్ ఆరీఫ్ (ఫైల్) కంచర్ల సంతోష్ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, బాపట్ల/చీరాల: ఒకప్పుడు ప్రశాంతంగా ఉన్న బాపట్ల జిల్లా కూటమి పాలనలో నేరాలకు అడ్డాగా మారింది. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన 45 రోజులలోనే ఒక్క చీరాల పట్టణంలోనే నాలుగు హత్యలు జరిగాయి. ఇందులో ఒక గ్యాంగ్‌రేప్ కూడా ఉంది. మంగళవారం రాత్రి చీరాల పట్టణం ఈపూరుపాలెం ఆదినారాయణ పురం వద్ద జరిగిన యువకుడు ఆరిఫ్ హత్య సంచలనం సృష్టించింది. కారులో వచ్చిన స్టూవర్టుపురానికి చెందిన కొందరు కోడికత్తులు, తల్వార్లతో విచక్షణారహితంగా పొడిచినట్లు తెలుస్తోంది. గాయపడ్డ ఆరిఫ్‌ను చీరాల ఏరియా ఆస్పత్రికి తరలించేలోపు మరణించాడు. గంజాయి తాగి కోడిపందేలు, దొంగతనాలు చేసే బ్యాచ్ ఈ హత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఆరిఫ్‌ను హత్య చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలంటూ ముస్లింలు బుధవారం ఆందోళనకు దిగారు. పోలీసుల వైఫల్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనివల్లే సీఎం చంద్రబాబు చీరాల పర్యటన కూడా రద్దయినట్టు ప్రచారం జరుగుతోంది. పైకిమాత్రం అధికారులు వర్షం వల్ల అని చెబుతున్నట్టు సమాచారం.

వరుస హత్యలు

జూన్ 21న బహిర్భూమికి వెళ్లిన సుచరిత(22)ను కొందరు యువకులు గ్యాంగ్‌రేప్ చేసి తర్వాత హత్యచేసి రైల్వేట్రాక్ సమీపంలో పడేశారు. ఇది గంజాయి తాగే యువకుల పనేనని పోలీసులు తేల్చారు. టైలరింగ్ పనితో కుటుంబాన్ని పోషిస్తున్న సుచరిత మరణం ఆ కుటుంబాన్ని రోడ్డున పడేసింది.

- ఇది జరిగిన రెండు రోజుల తర్వాత జూన్ 23న చీరాల పట్టణానికి చెందిన క్రీ పాయింట్ నిర్వాహకుడు సంతోష్(36)ను నాని అనే మరో వ్యాపారి కత్తితో పొడిచాడు. చికిత్స పొందుతూ సంతోష్ మృతి చెందాడు. ఇద్దరి మధ్య జరిగిన చిన్న గొడవ హత్యకు దారి తీసింది.
- జూలై 23న రాత్రి చీరాల పట్టణ పరిధిలోని ఈపూరిపాలెంకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయురాలు లలితమ్మను ఇంటిలో నిద్రిస్తుండగా దుండగుడు చొరబడి గొంతు వద్ద కత్తితో పొడిచి చంపి నగదు, నగలు అపహరించుకుపోయాడు. పోలీసుల దర్యాప్తులో కేబుల్ టీవీ నిర్వాహకుడే హత్య చేసినట్లు గుర్తించి అరెస్ట్ చేశారు.

కలెక్టర్ కారు సైరన్ విని నిందితుల పరార్

ఈ వరుస హత్యల నుంచి జనం తేరుకోకముందే మంగళవారం రాత్రి ఈపూరుపాలెం యూసుఫ్‌నగర్‌కు చెందిన ఆరిఫ్ హత్య జరగడం చీరాలతోపాటు జిల్లాను ఉలిక్కిపడేలా చేసింది. సైకిల్‌పై వెళ్తున్న ఆరిఫ్ కారుకు సైడ్ ఇవ్వకపోవడం వల్లే గంజాయి బ్యాచ్ కత్తులతో దాడికి పాల్పడింది. ఆ సమయంలో చీరాల నుంచి బాపట్ల వెళ్తున్న కలెక్టర్ వెంకట మురళి కారు సైరన్ వేయడంతో హంతకులు పోలీసులు అనుకొని పరారయ్యారు. కత్తిపోట్లతో ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న యువకుడి పరిస్థితిని గమనించి కలెక్టర్ 108కు ఫోన్ చేసి ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించేందుకు సహకరించారు. అయినా ఫలితం లేకపోయింది. చికిత్స పొందుతూ ఆరీఫ్ మృతిచెందాడు.

పోలీసు యంత్రాంగం చేతులెత్తేసిందా!

చీరాల నేరాలకు అడ్డాగా మారినా పోలీసులు స్పందించడం లేదు. నేరాల అదుపునకు చర్యలు చేపట్టడం లేదు. అధికారపార్టీ నేతల సేవలో తరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. గంజాయి, గోవా నుంచి అక్రమ మద్యం రవాణా యథేచ్ఛగా సాగుతున్నా పట్టించుకోవడం లేదు. కొందరు పోలీసు అధికారులకు ఈ తరహా అక్రమాలు ఆదాయ వనరుగా మారాయి. నేరగాళ్ల నుంచి వసూళ్లు చేసి వారిని ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. విధులను వదిలి పోస్టింగుల కోసం పాకులాడుతున్నారనే అపవాదునూ మూటగట్టుకున్నారు. అందుకే చీరాలలో శాంతిభద్రతలు క్షీణించాయనే వాదన వినిపిస్తోంది.

అందరినీ చంపేస్తాం

ఆరిఫ్ హంతకుడి సోదరుడి బెదిరింపులు

ఆరీఫ్ హత్యకు గురికావడంతో హంతకుడికి తమ్ముడు వరుసయ్యే ఈపూరుపాలెంకు చెందిన వ్యక్తి బరితెగించాడు. హత్య కేసును రాద్ధాంతం చేస్తున్నారని, ఇది చిన్న విషయమని. పెద్దది చేస్తే అందరినీ చంపేస్తాం అంటూ బెదిరింపులకు దిగాడు. ఈ తతంగాన్ని అందరూ ఫోన్‌లో చిత్రీకరించి టూటౌన్ సీఐకు అందించారు. అయితే అతడిని పోలీసులు అరెస్ట్ చేయలేదు.

సీఎంకు హత్యలు కనిపించట్లేదా?

ఇదిలా ఉంటే రాష్ట్రంలో ఎక్కడా హత్యలు జరగడం లేదని సీఎం చంద్రబాబు పదేపదే చెబుతున్నారు. చీరాలలో ఇన్ని దారుణాలు జరుగుతున్నా.. ఆయనకు తెలియడం లేదంటే నమ్మలేం. అయినా మసిబూసి మారేడుకాయ చేసేందుకు ఆయన అబద్ధాలు వల్లెవేస్తున్నారు. వాస్తవానికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రవ్యాప్తంగా శాంతిభద్రతలకు తిలోదకాలు వదిలింది. రక్తచరిత్రను ప్రోత్సహిస్తోంది. ఫలితంగా లా అండ్ ఆర్డర్ అస్తవ్యస్తమైంది.

బెయిల్‌పై బయటకు వచ్చిన నాలుగు రోజులకే హత్య..



ఆరిఫ్ హత్య కేసు నిందితులను స్టూవర్టుపురానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. వీరు ఇప్పటికే పలు కేసుల్లో నిందితులుగా ఉన్నారు. నాలుగు రోజుల క్రితమే బెయిల్‌పై బయటకు వచ్చారు. ఆ రోజు కోడి పందేలు ఆడి రూ.2 లక్షలు పోగొట్టుకున్నట్లు సమాచారం. అప్పటి నుంచి చీరాలలోని పలు చోట్ల గంజాయి, మద్యం తాగి తిరిగి స్టూవర్టుపురానికి వెళ్తుండగా ఆదినారాయణపురం వద్ద ఆరిఫ్ సైకిల్‌పై వెళ్తూ కారుకు అడ్డుగా వచ్చాడని హత్య చేశారు. వీరిపై వేదుళ్లపల్లితో పాటు పలు పోలీస్‌స్టేషన్లలో అనేక కేసులు ఉన్నాయి. నిత్యం రౌడీయిజం, హత్యాయత్నాలకు పాల్పడే వీరు రిమాండ్ ఖైదీలుగా ఉంటారు. వీరికి రెండు, మూడు కార్లు, అందులో వేటకొడవళ్లు, కోడికత్తులు ఉంటాయి. కోడిపందేలు వేస్తుంటారు. పోలీసులతో సత్సంబంధాలు పెట్టుకుని వారికి మామూళ్లు ఇస్తుంటారు. ఎవరైనా ప్రశ్నిస్తే వారిని చంపేందుకు ఒక్క క్షణం కూడా ఆలోచించరు. ఇంత కరుడుగట్టిన నేరస్తులు చీరాల కేంద్రంగా ఘోరాలకు ఒడిగడుతున్నా.. పోలీసులకు పట్టడం లేదు.

చీరాలలో చేనేత పార్కు ఏర్పాటు చేస్తాం

చేనేత శాఖ మంత్రి సవిత

చీరాల: చేనేతలకు స్వర్ణ యుగం మొదలైందని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చీరాల రూరల్ మండలం జాండ్రపేటలోని బట్ట వీరన్న అండ్ బీరక నాగయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. చీరాలలో చేనేత పార్కు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఆన్‌లైన్ మార్కెటింగ్ ప్రారంభిస్తామన్నారు. నేతన్నల కోసం నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. 365 రోజులు పాటు చేనేతలకు పని కల్పిస్తామని, వారు నేసిన వస్త్రాలకు మార్కెట్ సౌకర్యం కల్పిస్తామన్నారు. డిజైన్ల కోసం ప్రత్యేక శిక్షణలు ఇస్తామన్నారు. చేనేత వస్త్రాల మార్కెటింగ్ కోసం రాష్ట్ర స్థాయిలో టాటా కన్సల్టెన్సీని రాష్ట్ర మంత్రి నారా లోకేష్ మంగళగిరిలో ఏర్పాటు చేశారన్నారు. బాపట్ల ఎంపీ టి.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ చీరాల కుప్పడం పట్టు చీరలకు జియోట్యాగ్ వచ్చేలా కృషి చేస్తామన్నారు. దేశం నుంచి రూ.10వేల కోట్ల విలువైన ఎగుమతులు చేనేత ఉత్పత్తులేనని తెలిపారు. చీరాలలో ఉత్పత్తి అయ్యే చేనేత వస్త్రాల ఎగుమతులు మరింతగా పెంచుతామన్నారు. కలెక్టర్ వెంకటమురళి మాట్లాడుతూ చీరాలలో 16వేల మంది చేనేత కార్మికులు ఉన్నారని, వారంతా 71 సహకార సంఘాలుగా రిజిస్టర్ కాగా, అందులో 33 సంఘాలు మనుగడలో ఉన్నాయన్నారు. జాండ్రపేట, దేవాంగపురిలో 4వేల చేనేత కుటుంబాలను సర్వే చేశామన్నారు. చేనేతలకు అవసరమైన ముడిసరుకు దొరకడంలేదని, చేనేతలకు కూలి చాలడం లేదని, జీఎస్టీని తొలగించాలని కోరామన్నారు. విద్యుత్ రాయితీ, మగ్గాలకు అనుబంధమైన అచ్చులు ప్రింటింగ్ డయింగ్ చేసేవారిని చేనేతలుగా గుర్తించాలని, అర్హులైన వారందరికీ పింఛన్లు అందడం లేదని చేనేతలు చెప్పారన్నారు. వీటన్నింటిని ముఖ్యమంత్రి కార్యాలయానికి నివేదించామన్నారు. ఏడాదిలోగా చీరాల్లోని చేనేతల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామన్నారు. చేనేత వృత్తిని తిరిగి అభివృద్ధి చేస్తామని చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. ముందుగా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను చేనేత శాఖ మంత్రి, కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో జేసీ బి.సుబ్బారావు, హ్యాండ్లూమ్స్ డైరెక్టర్ పావన మూర్తి, మాజీ మంత్రి పాలేటి రామారావు, మాజీ ఎమ్మెల్యే బి.గరటయ్య, చేనేతలు పాల్గొన్నారు.



స్టాల్‌లో ఏర్పాటు చేసిన మగ్గాన్ని పరిశీలిస్తున్న మంత్రి సవిత

సీఎం పర్యటన రద్దుతో చేనేతల నిరాశ

చీరాల: జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం చీరాల ప్రాంతంలో నిర్వహించే కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వస్తారని అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేశారు. అయితే బుధవారం వర్షం వల్ల ఆయన పర్యటన రద్దు అయింది. ముఖ్యమంత్రి హోదాలో తొలిసారిగా చీరాల నియోజకవర్గానికి చంద్రబాబు వస్తుండడంతో వరాలు కురిపిస్తారని ఎంతో ఆశపడిన చేనేతలకు పర్యటన రద్దు కావడంతో తీవ్ర నిరాశే మిగిలింది.

ముస్లింల ఆందోళన

చీరాల: మైనార్టీ యువకుడు సయ్యద్ ఆరిఫ్‌ను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ముస్లిం మైనార్టీలు బుధవారం గడియార స్తంభం సెంటర్‌ను చుట్టుముట్టారు. దీంతో చీరాలలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. సీఎం చంద్రబాబు చీరాలకు వస్తున్నారని తెలిసి నిరసన తెలిపేందుకు ముస్లింలు సిద్ధమయ్యారు. చివరకు పర్యటన రద్దు కావడంతో గడియార స్తంభం కూడలిని చుట్టుముట్టారు. జిల్లా పోలీస్ యంత్రాంగం పలుమార్లు చర్చలు జరిపినా ముస్లింలు ఖాతరు చేయలేదు. హంతకుల సమాచారం ఉన్నప్పటికీ అరెస్ట్ చేయలేదని మండిపడ్డారు. స్టూవర్టుపురం నుంచి బాపట్ల వెళ్లి అక్కడ నివాసం ఉంటున్న నలుగురు యువకులే ఈ హత్య చేసినట్టు తెలిసినా ఇంకా గాలిస్తున్నామని, త్వరలో అరెస్ట్ చేస్తామని పోలీసులు చెప్పడంపై ధ్వజమెత్తారు. నిందితులను తక్షణం అరెస్టు చేయకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ప్రభుత్వానికి, పోలీసులకు అల్టిమేటం జారీ చేశారు.

హతుడి చెల్లెలికి ఉద్యోగం ఇస్తాం : జేసీ

ఆరిఫ్ కుటుంబాన్ని ఆదుకుంటామని జాయింట్ కలెక్టర్ సుబ్బారావు హామీ ఇచ్చారు. ముస్లిం మైనార్టీలతో చర్చలు జరిపిన ఆయన ఈ హత్య విషయంలో ప్రభుత్వం సీరియస్‌గా ఉందని, నిందితులను అరెస్టు చేసి తీరతామని స్పష్టం చేశారు. ఆరిఫ్ చెల్లెలికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. ఆర్థిక సాయానికీ హామీ ఇవ్వడంతో ముస్లింలు ఆందోళన విరమించారు. నిందితులను ప్రత్యేక కోర్టు ద్వారా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైద్యశాలలో ఆరిఫ్ మృతదేహాన్ని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పరిశీలించారు. ఆరిఫ్ తండ్రి అహ్మద్‌ను పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ కూడా ఆరిఫ్ తండ్రిని పరామర్శించారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా గాడి తప్పిందని విమర్శించారు. ఆరిఫ్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాడతామన్నారు. గడియార స్తంభం సెంటర్‌లో ఆందోళన చేస్తున్న ముస్లిం మైనార్టీలకు మద్దతుగా ఆమంచి బైఠాయించారు.



హతుడి కుటుంబానికి న్యాయం చేయాలంటూ గడియార స్తంభం సెంటర్‌లో ఆందోళన చేస్తున్న ముస్లింలు



పోలీసులు, ముస్లింల మధ్య వాగ్వాదం

నా కొడుకునే చంపి కేసు పెట్టవద్దంటూ భయపెట్టారు

నా కొడుకును అత్యంత పాశవికంగా చంపిన హంతకుడికి తమ్ముడు వరుస అయ్యే వ్యక్తి నా వద్దకే వచ్చి కేసు పెట్టవద్దంటూ భయపెట్టాడు. డిగ్రీ చదువుకునే నా కొడుకే నాకు ఆధారం. అతని పైనే ఆశలు పెట్టుకున్నా. ఆర్మీకి వెళ్లాలనే ఆశతో కాలేజీ పూర్తయిన తర్వాత జిమ్‌కు వెళ్లి రాత్రి 9 గంటలకు ఇంటికి వస్తుంటాడు. గొడవలకు వెళ్లే వ్యక్తి కాదు. తన స్నేహితుడితో కలిసి ఇంటికి వస్తున్న సమయంలో కారులో వచ్చిన యువకులు గొడవ పెట్టుకుని అకారణంగా కత్తులతో పొడిచి చంపేశారు. తోటి స్నేహితుడు ఫోన్ చేసి ఇద్దరూ హాస్పిటల్‌లో ఉన్నామని చెబితే అక్కడకు వెళితే నా కొడుకు మార్చురీలో ఉన్నాడు. అకారణంగా నా కొడుకును హత్య చేశారు. హంతకుడి తమ్ముడు నా ఇంటికి వచ్చి 'జరిగింది చిన్న విషయమే కదా... పెద్దది చేయకండి.. కాదని మాకు అడ్డంగా వస్తే ఇంట్లో అందరినీ చంపేస్తామని' బెదిరించాడు. ఆ ఫొటోలు, వీడియో టూటౌన్ సీఐకు పంపించాం. ఈపూరుపాలెంలో ఉండే అతడిని ఇప్పటి వరకు అరెస్ట్ చేయకపోవడం పోలీసుల నిర్లక్ష్యానికి నిదర్శనం. నా కొడుకును చంపిన వారిని అరెస్ట్ చేసి మాకు న్యాయం చేయాలి.



– సయ్యద్ అహ్మద్, ఆరిఫ్ తండ్రి

ఏడేళ్లకే నూరేళ్లు నిండాయి



బాలుడి మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లి, బంధువులు

రోడ్డు ప్రమాదంలో కుమారుడు మృతి, తండ్రికి గాయాలు

అద్దంకి రూరల్: ముందు వెళ్తున్న బస్సును ద్విచక్ర వాహనం ఢీ కొట్టడంతో కుమారుడు మృతి చెందగా తండ్రికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. అద్దంకి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బుధవారం రాత్రి ఇంకొల్లు నుంచి అద్దంకి బయలుదేరింది. మార్గ మధ్యలో అద్దంకి పట్టణంలోని రేణింగవరం రోడ్డులో గరటయ్య కాలనీ సమీపంలోకి రాగానే కాలనీకి చెందిన రాఘవ అతని కుమారుడు మణికంఠ (7) స్థానిక ప్రైవేటు వైద్యశాలలో ఉన్న అమ్మమ్మ చూసేందుకు బైక్‌పై వెళుతున్నారు. ఈ క్రమంలో ముందు వెళుతున్న బస్సును ఢీ కొట్టారు. ఈ ఘటనలో మణికంఠ అక్కడికక్కడే మృతి చెందగా, రాఘవకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాలుడు మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

జీజీహెచ్‌లో నోటిఫికేషన్ల రగడ

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో ప్రస్తుతం నోటిఫికేషన్ల రగడ జరుగుతోంది. దీనిపై కలెక్టర్‌కు, సీఎం, ఆరోగ్యశాఖ మంత్రికి ఫిర్యాదులు వెళ్లాయి. ఉద్యోగోన్నతిపై జూనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి 2016లో నోటిఫికేషన్ వెలువడింది. అప్పట్లో అర్హులుగా ముగ్గురి పేర్లు ప్రకటించి రెండు ఖాళీలు మాత్రమే ఉండటంతో ఇద్దరితో భర్తీచేశారు. మూడో అభ్యర్థికి ఖాళీ ఏర్పడగానే పోస్టు ఇస్తామని చెప్పారు. అయితే తనకు అన్యాయం చేశారని మూడో అభ్యర్థి కోర్టుకు వెళ్లారు. అయినా జీజీహెచ్ కార్యాలయ ఉద్యోగులు పట్టించుకోలేదు. ప్రస్తుతం పోస్టులు ఖాళీగా లేవని, పోస్టు ఖాళీ ఏర్పడినప్పుడు మూడో అభ్యర్థికి ఉద్యోగోన్నతి కల్పిస్తామని అప్పట్లో లిఖితపూర్వకంగా కోర్టుకు నివేదించారు. తాజాగా గత నెల 30న మళ్లీ జూనియర్ అసిస్టెంట్ పోస్టును భర్తీ చేస్తున్నట్లు నోటిఫికేషన్ విడుదల చేయడంతో దీనిపై ఆస్పత్రిలో రగడ జరుగుతోంది. నోటిఫికేషన్‌లో ఇంటర్ విద్యార్హత ఉంటే సరిపోయే దానికి డిగ్రీ విద్యార్హత పెట్టారని, తప్పులు ఉన్నాయని కలెక్టర్‌కు పలువురు అభ్యర్థులు ఫిర్యాదు చేశారు. ఈ నోటిఫికేషన్‌ను తక్షణమే రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ నేతలు మంగళవారం ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు.

రికార్డు అసిస్టెంట్ పోస్టుపైనా మీనమేషాలు

రికార్డు అసిస్టెంట్ పోస్టు ఖాళీ ఏర్పడి ఐదేళ్లు గడిచినా ఆస్పత్రి అధికారులు భర్తీ చేయకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో నోటిఫికేషన్ ఇచ్చినా ఇప్పటికీ భర్తీ చేయలేదు. దీంతో జీజీహెచ్ అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఉద్యోగులు సీఎం నారా చంద్రబాబునాయుడికి, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు ఈనెల 3న లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.



గుంటూరు జీజీహెచ్

క్లుప్తంగా

కాకుమాను ఆరోగ్య కేంద్రంలో టైల్స్ ధ్వంసం

కాకుమాను: మండల కేంద్రం కాకుమాను గ్రామ సచివాలయం-2 పరిధిలో గత ప్రభుత్వంలో నిర్మించిన హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ ఆవరణలో ఏర్పాటు చేసిన టైల్స్‌ను బుధవారం వేకువజామున గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ రవి ప్రసాద్, వెల్‌నెస్ సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. రోజు మాదిరిగానే మంగళవారం తమ విధులు ముగించుకుని సిబ్బంది వెళ్లారు. బుధవారం ఉదయం 9 గంటలకు విధులకు హాజరయ్యే సమయానికి వెల్‌నెస్ సెంటర్ ఆవరణలో ఏర్పాటు చేసిన టైల్స్ ధ్వంసమై కనిపించాయి. నీటి పైపులు, నీటి కుంటను పూడ్చివేసినట్లు వారు తెలిపారు. జేసీబీతో ధ్వంసం చేసినట్లు ఆనవాళ్లు ఉన్నట్లు గుర్తించారు. విషయాన్ని జిల్లా వైద్యాధికారుల దృష్టికి తీసుకువెళ్లి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు డాక్టర్ రవి ప్రసాద్ తెలిపారు.

పరిశోధనల దిశగా ప్రోత్సహించాలి

నరసరావుపేట ఈస్ట్: పాఠశాల విద్య స్థాయి నుంచే విద్యార్థులను పరిశోధనల వైపు ప్రోత్సహించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం ఇన్‌స్పైర్ మానిక్ నామినేషన్లపై జిల్లాలోని సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఈఓ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాలలోని పాఠశాలల నుంచి సైన్స్ ప్రాజెక్ట్‌లు నామినేట్ చేసేలా కృషి చేయాలని సైన్స్ ఉపాధ్యాయులను కోరారు.

చెన్నుపాటి.. సాహితీ ఘనాపాటి

- సమాజ హిత కావ్యాలతో ఎన్నో పురస్కారాలు
- ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా పలు సేవలు
- పేద విద్యార్థులకు ఆర్థిక భరోసానిస్తూ సాయం


రోటరీ క్లబ్ పురస్కారం అందుకున్న సందర్భంగా సత్కరిస్తున్న ప్రతినిధులు

అద్దంకి: శతకానికి తెలుగు సాహిత్యంలో ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. జానపదుల నుంచి పండితుల వరకు నోళ్లలో శతక పద్యాలు నానుతుంటాయి. అలాంటి పద్య కావ్యాలలో సమాజ హితమైన వేమన శతకం, దాశరథి శతకం, సుమతి శతకం, భర్తృహరి శతకం వంటివి ఉన్నాయి. గుర్రం జాషువా విరచిత గబ్బిలం ఖండకావ్యంలోని పద్యాలు ప్రజల నోళ్లలో ఎప్పుడూ నానుతూ ఉంటాయి. అవన్నీ సమకాలీన సమాజంలో నిత్యం జరిగే ఘటనలు, రచయితల స్వీయ అనుభవాలు జోడించి రాసినవే. ఆ కోవకు చెందినవారే పద్యకవి చెన్నుపాటి రామాంజనేయులు. ఆయన స్వతహాగా తెలుగు పండితులు. ఉద్యోగ విరమణ చేసిన తరువాత తన వంతుగా నిత్యం సమాజంలో జరిగే ఘటనల ఆధారంగా పద్యాలు రాస్తున్నారు. సమాజాన్ని మేల్కొలిపే దిశగా ప్రముఖుల ప్రశంసలు అందుకుంటున్నారు.

పద్య కవితలకు శ్రీకారం

అప్పుడప్పుడూ రేడియోలో వచ్చిన స్వరవినోదిని సమస్యలను పూరిస్తూ కవితారంగ ప్రవేశం చేశారు. రిటైరైన తరువాత 'నా జీవన యానం' అనే స్వీయ జీవిత చరిత్రకు సంబంధించిన పద్య కావ్యాన్ని రాసి మేటి కవుల ప్రశంసలందుకున్నారు. ఆ కావ్యానికి తిరువూరులో సాహితీ సమితి నుంచి జీవిత చరిత్ర పద్య కావ్యాల వరుసలో అత్యుత్తమ పుస్తకంగా పురస్కారం వచ్చింది. దాంతోపాటు చెన్నుపాటి శతకం, కల్లోల కరోనా, గీతికా కదంబం (ఖండ కావ్యం), నేటి దృశ్యం, వర్తమానం, అమ్మ (వచన కవిత) కావ్యాలను రచించారు. ప్రస్తుతం 'నేటి నిజం' కావ్యాన్ని తన వైవాహిక జీవిత స్వర్ణోత్సవం సందర్భంగా ఈ నెల 9న హైదరాబాద్‌లో ఆవిష్కరించనున్నారు.

అందుకున్న పురస్కారాలు..

- తిరువూరులో జీవిత చరిత్ర కోవలో స్వాతంత్ర్య సమరయోధుడు చిన నాగయ్య స్మారక పురస్కారం
- చీరాల వీఆర్‌ఎస్ అండ్ వైఆర్‌ఎన్ కళాశాలలో పూర్వ ప్రిన్సిపల్ పోలవరపు జగదీశ్వరరావు స్మారక పురస్కారం
- రోటరీ క్లబ్ ద్వారా పురస్కారం.
- వర్తమానం కావ్యం 2023లో అమెరికాలో నిర్వహించిన తానా సభల్లో ప్రచురణకు ఎంపికైంది.

విద్యాభివృద్ధికి చేయూత..

చిన్నతనంలో ఆర్థిక బాధలు ఎదుర్కొన్న రామాంజనేయులు తనలా పేద విద్యార్థులు ఇబ్బందులు పడొద్దనే ఉద్దేశంతో ఇంటర్ చదివే ఇద్దరికి ఏటా ఖర్చు భరిస్తున్నారు. ఇటీవల ఇద్దరు డిగ్రీ, ఇద్దరు టీటీసీ విద్యార్థులకు కూడా ఆర్థిక సాయం చేశారు.


కృష్ణా జిల్లా తిరువూరులో చిన నాగయ్య స్మారక పురస్కారం అందుకుంటున్న చెన్నుపాటి

రామాంజనేయులు స్వగ్రామం బాపట్ల జిల్లాలోని అద్దంకి మండలం చెరువుకొమ్ము పాలెం గ్రామం. రామలింగయ్య, బసవమ్మలకు

చెన్నుపాటి ప్రస్థానం..

1952లో జన్మించారు. ఈయన ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్యను గ్రామం, అద్దంకిలో పూర్తి చేశారు. చీరాలలోని వీఆర్‌ఎస్ అండ్ వైఆర్‌ఎన్ కళాశాలలో పీయూసీ, తిరుపతి వెంకటేశ్వర ప్రాచ్య కళాశాలలో విద్వాన్ (తెలుగు పండిట్) అభ్యసించారు. 1975లో మద్దిరాలపాడు హైస్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయుడిగా ఉద్యోగంలో చేరారు. విద్యార్థులకు చదువు చెబుతూనే తాను కూడా స్వయం కృషితో బీఈడీ, బీఏ, ఎంఏ పట్టాలు పొందారు. ఉపాధ్యాయుల కోసం ఏపీటీఎఫ్ సంఘంలో వివిధ పదవులు స్వీకరించి, రాష్ట్ర కార్యదర్శిగా కూడా వ్యవహరించారు. సంఘ మాసపత్రికకు సంపాదకుడిగా సేవలందించారు.


చీరాలలో జగదీశ్వరరావు స్మారక అవార్డు స్వీకరిస్తున్న దృశ్యం

ఉపాధ్యాయుల సర్దుబాటు నిలిపివేతకు వినతి


డీఈవో శైలజకు వినతిపత్రం సమర్పిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: పాఠశాలల్లో ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియను అనుమానాలు నివృత్తి చేసే వరకు నిలిపేయాలని ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు కె.బసవ లింగారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా విద్యాశాఖాధికారిణి పి.శైలజకు ఆమె కార్యాలయంలో ఇతర నేతలతో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకే కేడర్‌లో మిగులు ఉపాధ్యాయుల సీనియారిటీని మెరిట్ కం రోస్టర్ జాబితా లేకుండా నిర్ధారించడం కుదరదన్నారు. ఈ విషయం బదుల్లో ఘర్షణకు దారితీస్తోందన్నారు. ఎస్జీటీలకు మండల, హైస్కూల్ వారికి డివిజన్ స్థాయిలో మాన్యువల్‌గా ప్రక్రియ చేపట్టాలన్నారు. రాష్ట్ర స్థాయిలో ఆన్‌లైన్ విధానం సరికాదన్నారు. గ్రీవెన్స్ సెల్స్ ఏర్పాటుకు విన్నవించారు. డీఈవోను కలిసిన వారిలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్ , జిల్లా ఉపాధ్యక్షుడు పి.నాగ శివన్నారాయణ, జిల్లా కార్యదర్శులు సత్యన్నారాయణ మూర్తి, జి.దాస్, జిల్లా కౌన్సిలర్లు కిషోర్, శివరామకృష్ణ, జోసెఫ్ కిరణ్, గురుమూర్తి, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

కరకట్ట సంగతి సరే... వారధి భద్రత మాటేంటి?

ఆర్‌సీ అధికారుల తీరుపై ప్రజల నిరసన


పెదలంక అరవింద వారధి వెంట పొక్లయిన్‌తో ఇసుక తవ్వకాలు చేయిస్తున్న ఆర్‌సీ అధికారులు

కొల్లూరు: కృష్ణా నదికి వరదలు సంభవిస్తే బలహీనంగా ఉన్న కరకట్టను బలోపేతం చేయాల్సిన ఆర్‌సీ (రివర్ అండ్ కన్జర్వేషన్) అధికారులు వ్యవహారంపై విమర్శలు వస్తున్నాయి. నదిపై ఉన్న వారధి మనుగడకు ముప్పు వాటిల్లేలా వ్యవహరిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రకాశం బ్యారేజ్ నుంచి సముద్రంలోకి వరద నీటిని విడుదల చేస్తున్న తరుణంలో బలహీనంగా ఉన్న కరకట్టను బలోపేతం చేసేందుకు అవసరమైన ఇసుకను మండలంలోని పెసర్లంక-పెదలంక మధ్య కృష్ణా నదిపై ఉన్న అరవింద వారధి వెంట పొక్లయిన్ వినియోగించి తవ్వకాలు చేపడుతుండటం ఆర్‌సీ యంత్రాంగం నిర్లక్ష్యాన్ని తేటతెల్లం చేస్తుంది. 9 లంక గ్రామాలలోని సుమారు 5 వేల మంది ప్రజా రవాణాకు, వ్యవసాయోత్పత్తుల తరలింపునకు ప్రధాన మార్గంగా ఈ వారధి ఉంది. దీనికి ఇరువైపులా సుమారు 500 మీటర్ల వరకు ఎటువంటి తవ్వకాలు చేపట్టరాదన్న నిబంధన ఉంది. ఆర్‌సీ అధికారులే ఇలా తవ్వకాలు జరపడం లంక గ్రామవాసులను ఆందోళనకు గురిచేస్తోంది. ఇసుక అక్రమ రవాణాదారులు సైతం వారధి వెంట ఇష్టానుసారం ఇసుక తవ్వకాలు చేపడుతుండగా, ఇప్పుడు ఆర్‌సీ అధికారులు సైతం తవ్వి కొల్లూరులోని ఆర్‌సీ కార్యాలయానికి తరలిస్తుండటం గమనార్హం. ఎగువ ప్రాంతాలలో అధిక వర్షపాతం కారణంగా కృష్ణా నదికి ఏ సమయంలో వరద రూపంలో విపత్తు ముంచుకొస్తుందోనన్న ఆందోళనతో జిల్లా కలెక్టర్ సహా అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉన్నారు. నెల రోజుల నుంచి తీర ప్రాంత లంక గ్రామాలలో పర్యటిస్తూ ముందస్తు చర్యలపై దృష్టి పెట్టారు. వరద తీవ్రత గ్రామాల మీద పడకుండా కట్టడి చేయడంలో కీలకమైన ఆర్‌సీ విభాగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై ఇతర ప్రభుత్వ శాఖల అధికారుల్లో చర్చనీయాంశంగా మారింది. శ్రీశైలం, నాగార్జున సాగర్ నిండుకుండలను తలపిస్తూ దిగువకు నీటిని విడుదల చేసే సూచనలు కనిపిస్తున్నప్పటికీ ఆర్‌సీ యంత్రాంగం మాత్రం కరకట్టలు, బలహీనంగా ఉన్న నదిగట్లను పటిష్టం చేసేందుకు ఇసుక బస్తాలను నేటి వరకు సిద్ధం చేసుకోకపోవడం వారి అలసత్వాన్ని తేటతెల్లం చేస్తోంది. ప్రకాశం బ్యారేజ్ నుంచి దిగువకు సుమారు 1.50 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేసిన అనంతరం హడావిడిగా ఇసుక బస్తాల కోసం ఇసుక తరలించడం ఆర్‌సీ యంత్రాంగ అజాగ్రత్తకు తార్కాణంలా నిలుస్తోంది. బుధవారం సాయంత్రానికి సైతం ఇసుక బస్తాలు సిద్ధం చేయకపోవడంపై వరద రక్షణ చర్యల్లో ప్రభుత్వ అశ్రద్ధపై ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మూడో ప్రమాద హెచ్చరిక తరువాతే ఏర్పాట్లు

నదికి వరద నీరు విడుదల చేసిన అనంతరం మూడో ప్రమాద హెచ్చరిక ఇచ్చిన తరువాతనే కరకట్టలు, నదీ గట్లు బలోపేతానికి చర్యలు తీసుకోగలుగుతాం. ముందుగా ఇసుక బస్తాలు సిద్ధం చేసుకొనే వెసులుబాటు మాకు లేదు. అప్పటికీ మేం ముందుగానే బస్తాలను సిద్ధంగా ఉంచడానికి ఇసుకను సమకూర్చుకుంటున్నాం.

– సురేష్, ఆర్‌సీ ఏఈ, కొల్లూరు

ప్రతి ఖైదీకి ఉచిత న్యాయ సహాయం

- సీనియర్ డివిజన్ సివిల్ జడ్జి
- జిల్లా కారాగారంలో తనిఖీలు


భోజనం రుచి చూస్తున్న సివిల్ జడ్జి లీలావతి

నగరంపాలెం: గుంటూరు బ్రాడీపేటలోని జిల్లా కారాగారంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ డివిజన్ సివిల్ జడ్జి టి.లీలావతి బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా కారాగారంలోని లీగల్ సర్వీసెస్ క్లినిక్‌ను సందర్శించారు. ఉచిత న్యాయ సహాయం, సూచనల గురించి ఖైదీలకు వివరించారు. ప్రతి ఖైదీకి ఉచిత న్యాయ సహాయం త్వరితగతిన అందించేందుకు ఉన్న అవకాశాలను చెప్పారు. భోజనం, ఇతరత్రా సదుపాయాలపై ఆరా తీశారు. వాటిపై సంతృప్తి వ్యక్తం చేశారు. న్యాయ సహాయం కోసం అర్జీలు అందించాలని, తద్వారా ఉచితంగా వాదించేందుకు న్యాయవాదిని నియమించనున్నట్లు తెలిపారు. స్తోమత లేని ప్రతి రిమాండ్ ఖైదీకి ఉచిత న్యాయ సహాయం అందిస్తామని పేర్కొన్నారు. నేరం జరిగే నాటికి 18 ఏళ్లు నిండకపోతే వారు బాలలే అని అన్నారు. ఏదైనా నేరం చేస్తే బాలల న్యాయ మండలి వద్ద హాజరుపర్చాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ సిస్టం మధుబాబు, జిల్లా జైలు సూపరింటెండెంట్ కె.రఘు, సిబ్బంది పాల్గొన్నారు.

సీట్లు పెంచాకే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల అమలుకు డిమాండ్

గుంటూరు రూరల్: ఎంబీబీఎస్ సీట్లు విక్రయించడానికి అనుకూలంగా జీవో నెంబర్ 107, 108లను తీసుకొచ్చారని ఏపీ మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు ఆరోపించారు. ఆ జీవోలను రద్దు చేయటంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు కళాశాలల్లో సీట్లు పెంచకుండా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అమలు చేస్తే బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓసీ జనరల్ విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఉన్న సీట్లను పెంచిన తరువాత మాత్రమే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం చేసిన చట్టంలోనే ఉందని గుర్తు చేశారు. ఇప్పుడు ఓపెన్ సీట్లలో 10 శాతం కోత విధించి ఈడబ్ల్యూఎస్ అమలు చేయాలని ప్రభుత్వం ఎలా భావిస్తుందని ప్రశ్నించారు. ఈడబ్ల్యూఎస్‌కు తాము వ్యతిరేకం కాదని, ప్రైవేటు కళాశాలల్లో సీట్లు పెంచిన తరువాత మాత్రమే ఈ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. జీవో నంబర్ 107, 108లను రద్దు చేయాలని, నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లోని మొత్తం సీట్లను ప్రతిభావంతులైన విద్యార్థులకే కేటాయించాలని కోరారు.

క్వారీ గుంతలో వ్యక్తి గల్లంతు

- ఎన్డీఆర్‌ఎఫ్ బృందంతో గాలింపు
- ఆందోళనలో కుటుంబ సభ్యులు
- 24 గంటలు గడిచినా లభించని ఆచూకీ


గాలింపు చేపట్టిన ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం

పిడుగురాళ్ల: పుల్కా తినేందుకు డాబాలో కూర్చున్న సమయంలో ఒక్కసారిగా పోలీసులు సైరన్ వస్తుండటంతో భయపడి పరుగు తీసే క్రమంలో పంజాబీ డాబా వెనుక ఉన్న క్వారీ గుంతలో పడి వ్యక్తి గల్లంతైన సంఘటన పిడుగురాళ్ల పట్టణంలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. సమాచారం మేరకు... పిడుగురాళ్ల పట్టణానికి చెందిన నాయిని హనుమంతరావు (36)తోపాటు మరో ఇరువురు జెమిని, వెంకటేశ్వర్లు పంజాబీ డాబాలో పుల్కా తినేందుకు వెళ్లారు. అప్పటికే సమయం అర్ధరాత్రి 12 గంటలు అవుతుంది. పిడుగురాళ్ల పట్టణ సీఐ రాత్రి సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పంజాబీ డాబాలో లైట్లు వెలుగుతుండటంతో సైరన్ వేసుకుంటూ పోలీసులు అక్కడకు వెళ్లారు. పోలీసులు కొడతారేమోనని భయంతో ముగ్గురు పరుగులు తీశారు. నాయిని హనుమంతరావు డాబా వెనుక వైపు పరుగులు తీశాడు. ఆ ప్రాంతమంతా చీకటిగా ఉండటంతో క్వారీ గుంత కనిపించక అందులో పడిపోయాడు. గమనించిన పంజాబీ డాబాలో పనిచేసే వర్కర్ హిందీలో డాబా నిర్వాహకుడికి చెప్పాడు. అతను పట్టణ సీఐ వెంకట్రావుకు సమాచారం ఇచ్చాడు. వెంటనే గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. గల్లంతు అయిన హనుమంతరావుకు చెందిన చెప్పులు కనిపించడంతో దాని ఆధారంగా గల్లంతైనట్లు గుర్తించారు. గజ ఈతగాళ్లకు హనుమంతరావు కనిపించలేదు. బుధవారం సాయంత్రం ఎస్‌డీఆర్‌ఎఫ్ (స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) ద్వారా గాలింపు చర్యలు చేపట్టారు. 24 గంటల తరువాత పూర్తి సమాచారం వస్తుందని పట్టణ సీఐ తెలిపారు. బుధవారం రాత్రి 10 గంటలకు కూడా హనుమంతరావు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు విషాదంలో మునిగారు.

బకింగ్‌హామ్ కెనాల్‌లో మహిళ గల్లంతు



తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి వైఎస్సార్ సెంటర్ (కొత్తూరు) ఆంజనేయస్వామి దేవస్థానం ప్రాంతానికి చెందిన ఓ మహిళ బకింగ్‌హామ్ కెనాల్‌లో బుధవారం గల్లంతయ్యారు. సేకరించిన వివరాల ప్రకారం.. వైఎస్సార్ సెంటర్ (కొత్తూరు)లో నివాసం ఉంటున్న దాసరి పాండురంగారావు భార్య శివనాగమణి (58) ఇంట్లో పూజా సామగ్రి, ఇతర వస్తువులను కాలువలో కలిపేందుకు బయలుదేరారు. ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద మెట్ల మార్గంలో కిందికి దిగి బకింగ్‌హామ్ కెనాల్ నీటిలో కలుపుతుండగా నీటి వేగానికి కింద పడిపోవడంతో ఆమె గల్లంతయ్యారు. వెంటనే స్థానికులు ఆమె కోసం గాలించినప్పటికీ ప్రయోజనం కనిపించలేదు. భర్త పాండురంగారావు దీనిపై తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జెడ్పీ జాగా.. వేసెయ్ పాగా!

- జిల్లా పరిషత్ స్థలంపై టీడీపీ నేతల కన్ను
- రూ. కోట్ల విలువైన రెండు ఎకరాలు దక్కించుకునేందుకు యత్నాలు
- సత్తెనపల్లి ప్రధాన రహదారి పక్కన కబ్జా తంతు
- ఆక్రమణలు జరుగుతున్నా పట్టించుకోని అధికార యంత్రాంగం


సత్తెనపల్లి వడ్డవల్లి పరిధిలోని జెడ్పీ స్థలం


జెడ్పీ స్థలంలో ఏర్పాటు చేసిన దుకాణం

సత్తెనపల్లి: సామాన్య ప్రజలు గూడు కోసం చిన్న పాక వేసుకుంటే అధికారులు నానా హంగామా చేసి, అది ఊడ బెరికేదాక ఊరుకోరు. అయితే ఏకంగా రూ. కోట్లు విలువచేసే జడ్పీ భూమి తమ కళ్లెదుటే దర్జాగా ఆక్రమించుకుంటున్నా తమకేమీ పట్టనట్లు కళ్లకు గంతలు కట్టుకొని కూర్చున్నారు. ఇదీ పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని ప్రధాన రహదారి పక్కన గల రెండు ఎకరాల జడ్పీ స్థలం ఆక్రమణ తంతు. సత్తెనపల్లి పట్టణంలోని గుంటూరు – మాచర్ల ప్రధాన రహదారి పక్కన వడ్డవల్లి రఘురాంనగర్ పరిధిలోని సర్వే నెంబర్ 12లో 3 ఎకరాల భూమిని కట్టమూరి అహోబిల భాస్కరరావు విద్యాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని విద్యాసంస్థలు నెలకొల్పి అభివృద్ధి చేసేందుకు జడ్పీకి దానం ఇచ్చారు. ఆ భూమి అవసరం లేని పక్షంలో తమ కుటుంబ సభ్యులకు ఇవ్వమని అప్పట్లో బైలాలో రాసుకున్నారు. అయితే ఆ భూమిలో ఎకరం భూమిని అయ్యప్ప స్వామి దేవాలయానికి కేటాయించడంతో ఆలయం నిర్మాణం పూర్తయి ప్రస్తుతం పూజలు జరుగుతూ వాడుకలో ఉంది.

కోర్టులో భూ వ్యవహారం..

ఎంతో దయార్ద్ర హృదయంతో విలువైన భూమిని దానం ఇచ్చినప్పటికీ మిగిలిన రెండు ఎకరాల భూమిని ఖాళీగా ఉంచారు. ఎలాంటి విద్యాసంస్థలు నెలకొల్పకపోవడంతో తన తండ్రి ఆశయం నెరవేరలేదు కనుక తిరిగి భూమిని తమకు అప్పగించాలని అహోబిల భాస్కరరావు కుమారుడు కట్టమూరి నరసింహారావు జడ్పీని కోరాడు. దీనిపై అధికారులు ఏమీ తేల్చకపోవడంతో కట్టమూరి నరసింహారావు వేరొకరికి రెండు ఎకరాలు విక్రయించాడు. దీనిపై అటు జడ్పీ అధికారులు, ఇటు కట్టమూరి నరసింహారావులు కోర్టును ఆశ్రయించగా జడ్పీకి అనుకూలంగా తీర్పు వచ్చింది. అయితే కట్టమూరి నరసింహారావు నుంచి కొనుగోలు చేసిన వ్యక్తులు మరొకరికి భూమిని విక్రయించాడు. వారు కూడా కోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారం కోర్టులో నడుస్తోంది.

అన్యాక్రాంతం కాకుండా గత ఎమ్మెల్యేల కృషి..

సత్తెనపల్లిలోని విలువైన రెండు ఎకరాల జిల్లా పరిషత్ స్థలం అన్యాక్రాంతం కాకుండా గత ముగ్గురు ఎమ్మెల్యేలు కృషి చేశారు. 2004, 2009లో సత్తెనపల్లి శాసనసభ్యుడుగా ఎన్నికైన యర్రం వెంకటేశ్వరరెడ్డి ఆ స్థలాన్ని సంరక్షించారు. అనంతరం 2014 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఎన్నికైన డాక్టర్ కోడెల శివప్రసాదరావు విలువైన జిల్లా పరిషత్తు స్థలం వృథాగా ఉంటే అన్యాక్రాంతమవుతుందనే ఉద్దేశంతో కొంత స్థలంలో పంచాయతీరాజ్ గెస్ట్‌హౌస్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆ భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. ఇక 2019 సార్వత్రిక ఎన్నికల్లో శాసనసభ్యుడిగా ఎన్నికైన అంబటి రాంబాబు విలువైన రెండు ఎకరాల జిల్లా పరిషత్ స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా రూ. 20 లక్షలు వినియోగించి స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణం, రెండు వైపులా గేట్లు ఏర్పాటు చేయించారు.

ఆక్రమణల యత్నాల్లో టీడీపీ నేతలు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో విలువైన రెండు ఎకరాల జడ్పీ స్థలంపై టీడీపీ నేతల కన్ను పడింది. లీజు అగ్రిమెంట్ రాయించుకొని కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టేందుకు వేగంగా పావులు కదుపుతున్నారు. ఇప్పటికే జడ్పీ స్థలానికి ముందు భాగంలో రోడ్డు పక్కన చిరు వ్యాపారులు చిన్న చిన్న బంకులు ఏర్పాటు చేసుకున్నారు. జడ్పీ స్థలంలో నిర్మించిన గెస్ట్‌హౌస్ పక్కన ఖాళీ స్థలం ఆక్రమించి వెంకటేశ్వర జనరల్ స్టోర్ పేరుతో ఇనుముతో తయారు చేయించిన బంకు ఏర్పాటు చేశారు. ఇలా ఆక్రమణల పర్వం మొదలైంది. టీడీపీకి చెందిన ఓ ముఖ్య నాయకుడు పంచాయతీరాజ్ గెస్ట్‌హౌస్‌కి పక్కన ఖాళీగా ఉన్న స్థలాన్ని ఎలాగైనా దక్కించుకోవాలని ప్రయత్నాలు ముమ్మరం చేశాడని ఆ పార్టీ వర్గాలే బహిరంగంగా చర్చించుకుంటున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వ ఆస్తుల సంరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.